క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారిని తొలగించాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఏమాత్రం సహకరించని జిల్లా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ ఈడీ విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సంక్షేమ శాఖ హాస్టళ్లలో, దళితబంధులో అనేక అవకతవకలు జరిగినా అధికారి ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాల్‌రాజ్, మల్‌శెట్టి రవి, కిరణ్, కుమార్, రాజు, సంజీవులు, ప్రభాకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా బాలింగం



నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

కౌడిపల్లి(నర్సాపూర్): బీజేపీ కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడిగా వెల్మకన్న గ్రామానికి చెందిన బాలింగం ఎన్నికయినట్లు మండలాధ్యక్షుడు రాకేశ్ తెలిపారు. సోమవారం ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ బాలింగంకు నియామక పత్రం అందజేశారు. అనంతరం బాలింగం మాట్లాడుతూ.. కిసాన్ మోర్చా తరఫున రైతు సమస్యలపై పోరాడుతానని చెప్పారు.

మార్కెట్ స్థలంలోనే మాంసం అమ్మాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మాంసం విక్రయదారులు తమ ఇళ్ల వద్ద, రోడ్ల పక్కన విక్రయించొద్దని, మార్కెట్ స్థలంలోనే మాంసం అమ్మాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. ఆయన సోమవారం పట్టణంలోని మాంసం విక్రయదారులతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. మటన్ మార్కెట్ షెడ్డు కూల్చివేసినందున అదే స్థలంలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొని మాంసం అమ్మాలని చెప్పారు. తమ ఇళ్ల వద్ద, మటన్ మార్కెట్ సమీపంలో రోడ్డు పక్కన మాంసం అమ్మడంతో దుమ్ము ధూళీ మాంసంపై పడి ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉన్నదని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరి, రాంచందర్‌లతో పాటు పలువురు మటన్ వ్యాపారులు పాల్గొన్నారు.

మోదీసభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

టేక్మాల్(మెదక్): ప్రధాని నరేంద్రమోదీ అల్లాదుర్గం బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు నాయకులకు మండలాధ్యక్షుడు నవీన్‌గుప్తా కోరారు. సోమవారం బీజేపీ మండల కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు నాయికోటి శామయ్య ఎల్లుపేట రాజు, గిరిజన మోర్చా అధ్యక్షుడు రెడ్యానాయక్ అధ్యక్షతన టేక్మాల్‌లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జగదీష్ పాటిల్, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, ఉపాధ్యక్షుడు వడ్డె రాములు, గిరిజన మోర్చా అధ్యక్షుడు సేనాపతి, యువమోర్చా అధ్యక్షుడు పవన్, టేక్మాల్ పట్టణ అధ్యక్షులు దొడ్ల నాగరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నార్సింగిలో బీఆర్ఎస్ ప్రచారం

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సోదరుడు వెంకట నారాయణరెడ్డి, సోదరి సరిత సోమవారం నార్సింగి మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నార్సింగి ఎంపీపీ సబిత, జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, దౌలతాబాద్ జెడ్పీటీసీ జ్యోతి, వైస్ ఎంపీపీ సుజాత, మండల అధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో ఆమెదే ఆధిక్యం



- నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువ
- అభ్యర్థుల గెలుపోటములో వీరే కీలకం

నర్సాపూర్: నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈనెల 26న ప్రకటించిన తుది జాబితా మేరకు నియోజకవర్గంలో 2లక్షల 27వేల 126 మంది ఓటర్లు ఉన్నారు. కాగా వారిలో ఒక ఎన్ఆర్ఐ(పురుష) ఓటరుతో పాటు 36 మంది పురుష సర్వీసు ఓటర్లు, ఇద్దరు మహిళా సర్వీసు ఓటర్లతో పాటు ఆరుగురు ఇతరులు ఉన్నారు. కాగా నియోజకవర్గంలో ఒకలక్ష10వేల 220 మంది పురుష ఓటర్లు ఉండగా ఒకలక్ష 16వేల 9వందల మహిళా ఓటర్లు ఉన్నారు. నర్సాపూర్ మండలంలో 21వేల 258 మంది పురుషులు ఉండగా 22వేల 248 మంది మహిళా ఓటర్లు, ముగ్గురు ఇతరులు కలిపి 43వేల 509 మంది ఓటర్లు ఉన్నారు. కౌల్దారం మండలంలో 12వేల815 మంది పురుషులు, 14వేల 13మంది మహిళా ఓటర్లు ఉండగా ఇతర విభాగంలో ఒక ఓటరు కలిపి 26వేల829 మంది ఓటర్లు ఉన్నారు. కౌడిపల్లి మండలంలో 14వేల 298 మంది పురుష ఓటర్లు, 14వేల 917మంది మహిళా ఓటర్లతో 29వేల 215 మంది ఓటర్లు ఉన్నారు. కాగా చిలప్‌చెడ్ మండలంలో 7వేల 901 మంది పురుష ఓటర్లు, 8వేల528 మంది మహిళా ఓటర్లతో 16వేల 429 మంది ఓటర్లు ఉన్నారు. శివ్వంపేట మండలంలో 16వేల 428 మంది పురుష ఓటర్లు, 17వేల386 మంది మహిళలు, ఇతర విభాగంలో ఒక ఓటరు కలిపి 33వేల 815 మంది ఓటర్లు ఉన్నారు. వెల్దుర్తి మండలంలో 11వేల819 మంది పురుష ఓటర్లు, 12వేల 705 మంది మహిళా ఓటర్లు కలిపి 24వేల 524 మంది ఓటర్లు ఉన్నారు. కాగా మాసాయిపేట మండలంలో 4151 మంది పురుష ఓటర్లు, 4491 మంది మహిళా ఓటర్లతో 8వేల642 మంది ఓటర్లు ఉన్నారు. హత్నూర మండలంలో 20వేల 338 మంది పురుషులు, 21వేల 356 మంది మహిళా ఓటర్లు, ఇతర విభాగంలో ఒక ఓటరు కలిపి 41వేల 695 మంది ఓటర్లు ఉన్నారు. కాగా మనోహరాబాద్ మండలంలోని మూడు పోలింగ్ బూత్‌లు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. మూడు పోలింగ్ బూత్‌లలో 1176 మంది పురుష ఓటర్లు, 1254మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కాగా ఎన్నికల అధికారులు నియోజకవర్గంలో 37 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీపీ హరికృష్ణ

తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి

ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. సోమవారం ఎంపీపీ అధ్యక్షతన శివ్వంపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల గురించి ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదని అన్నారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష మాట్లాడుతూ.. కొత్తపేట రేషన్ డీలర్ సమయపాలన పాటించకుండా బియ్యం ఇవ్వడం లేదని అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సహకరించాలని అన్నారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలి

ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగితే సంబంధిత శాఖ అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటిస్తూ ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతాయనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రాకుండా సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోళ్ల కేంద్రాల వద్ద తాగునీటితో ఇతర ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. విధులపై నిర్లక్ష్య ధోరణి అవలంభించే సిబ్బందిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. వరి సాగు వేదజల్లే పద్ధతిలో చేస్తే ఖర్చులు తగ్గుతాయని ఈ విషయంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జెడ్పీకోఆప్షన్ మెంబర్ మన్సూర్, వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిషన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య అన్నారు. సోమవారం మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ప్రాథమిక సహకార సంఘం ద్వారా 16, ఐకేపీ ద్వారా, 7 రైతు సంఘం ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయా కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలన్నారు. తూకం వేసిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమవుతాయన్నారు. కార్యక్రమంలో శివ్వంపేట పీఏపీఎస్ సీఈఓ మధు, ఏఈఓ మజీద్ ఉన్నారు.



శివ్వంపేటలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ

బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంతోష్



పాపన్నపేట(మెదక్): బీజేపీ మెదక్ జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడిగా సంతోష్ చారి నియామకమయ్యారు. సోమవారం ఈ మేరకు పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు గడ్డ కాశీనాథ్ ఉత్తర్వులు అందజేశారు.

మేడేను జయప్రదం చేయండి

మెదక్ కలెక్టరేట్: ప్రపంచవ్యాప్తంగా మే 1న జరుగుతున్న కార్మిక దినోత్సవంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ పిలుపునిచ్చారు. సోమవారం మెదక్‌లో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని కార్మిక జెండా ఆవిష్కరణ నిర్వహించాలని తెలిపారు. అలాగే మండల కేంద్రాల్లో జరిగే మేడే కార్యక్రమాలకు హాజరు కావాలని తెలిపారు.

జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా శ్రీపాల్



నియామకపత్రం అందుకుంటున్న శ్రీపాల్

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా హవేళిఘణాపూర్‌కు చెందిన శ్రీపాల్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అందజేశారు.

మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ప్రవీణ్

కౌల్దారం(నర్సాపూర్): మండల బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన నాయకోటి ప్రవీణ్‌ను నియమించినట్లు మండలాధ్యక్షుడు దయాకర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలు తెలిపారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రవీణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు యాదగిరి, యువ మోర్చా అధ్యక్షుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిన వరి పంట

శివ్వంపేట(నర్సాపూర్): భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పాటు విద్యుత్ అంతరాయంతో పంటలు ఎండిపోతున్నాయి. చేతికి వచ్చిన పంటలకు నీరందకపోవడంతో ఎండుముఖం పడుతున్నాయని రైతులు వాపోయారు. మండల పరిధిలోని చండి గ్రామ పరిధిలోని వ్యవసాయ బోరుబావులకు 24 గంటల విద్యుత్ రావడం లేదని అన్నారు. 16 గంటలు కరెంట్ వస్తుందని సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి 10 రోజుల వరకు 24 గంటల విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేస్తే పంటలు గట్టెక్కుతాయని రైతు అంజిరెడ్డి అన్నారు.

పెట్రోల్ బంకు పునఃప్రారంభం



పెట్రోల్ బంకు ప్రారంభిస్తున్న చైర్మన్ రమేశ్

పాపన్నపేట(మెదక్): ఈ ఏడు రూ.45 కోట్ల టర్నోవర్‌తో రైతులకు ఆర్థిక వినిమయ సేవలు అందించినట్లు కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రమేశ్ ప్రకటించారు. సోమవారం సొసైటీ పరిధిలోని పెట్రోల్ బంకు పునః ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘాన్ని ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని 13 గ్రామాలకు సొసైటీ సేవలందిస్తుండగా, 3303 రైతులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. వీరికి ఈ ఏడు రైతు నేస్తం క్రింద రూ.2 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల రుణాలు, 43 ద్విచక్ర వాహనాల రుణాలు మంజూరు చేశామన్నారు. రైతులకు అన్ని రకాల వినిమయ, ఆర్థిక సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ఆయా గ్రామాల్లో కౌంటర్‌లు ఏర్పాటు చేసి, ఎరువులు అందిస్తున్నట్లు చెప్పారు. సొసైటీకి రైస్‌మిల్‌తో పాటు గోదాంలు, ఇతర బిల్డింగ్‌లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు, మంబోజిపల్లి డీసీసీబీ బ్యాంకు మేనేజర్ ప్రణీత్, మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, ఏడుపాయల మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, సందీప్, రవికుమార్, శ్రీనాథ్, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): కాంగ్రెస్ మాయమాటలు నమ్మి ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసి మరోమారు మోసపోకూడదని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పోచమ్మరాళ్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో వెనకబడిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాణిక్యరెడ్డి, కొంపల్లి సుభాశ్‌రెడ్డి, మేకల సాయిలు, సాయిలు, సతీశ్ రావు, తదితరులు ఉన్నారు.



హవేళిఘణాపూర్(మెదక్): పోచమ్మరాళ్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

హవేళిఘణాపూర్(మెదక్): అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బీ.తిమ్మాయిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన వనజ, పోచయ్య మొదటి కుమారుడు తలారి విజయ్(24) మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం తండ్రి పోచయ్య బావి వద్ద గేదెలను మేపడానికి వెళ్లగా గుడిసెలో విజయ్ ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే అతడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. మృతుడి తలకు రక్తస్రావం కావడంతో ఎవరైనా చంపి ఉరివేశారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతుడు విజయ్‌కు అదే గ్రామానికి చెందిన రమ్యతో రెండు నెలల కిందట వివాహమైంది.

వాహనాల్లో తనిఖీలో నగదు స్వాధీనం



బొడ్మట్‌పల్లిలో లక్ష రూపాయల నగదును రశీదును అందజేస్తున్న పోలీసులు



మనోహరాబాద్(తూప్రాన్): పట్టుకున్న నగదుకు రశీదును అందిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి పోలీస్ చెక్‌పోస్టు వద్ద సోమవారం నిర్వహించిన తనిఖీలో రూ.ఒక లక్షను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మురళి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ.పాటిల్ బంధువుల్లో ఒకరైన అభినవ్‌పాటిల్ నాందేడ్ నుంచి టేక్మాల్ వస్తున్నారు. ఈ క్రమంలో బొడ్మట్‌పల్లి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా.. లక్ష రూపాయలు లభించగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అతడికి రశీదు అందజేశారు. అనంతరం నగదును సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో డిపాజిట్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అదే సమయంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీ.పాటిల్ టేక్మాల్ నుంచి అల్లాదుర్గంకు వెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు.

కాళ్లకల్ చెక్ పోస్టువద్ద..

మనోహరాబాద్(తూప్రాన్): సరైన పత్రాలు లేకుండా నగదుతో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద నుంచి లక్ష రూపాయల నగదుని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన వనం రాజిరెడ్డి తన కారులో డబ్బుతో ప్రయాణిస్తుండగా కాళ్లకల్ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేశారు. దీంతో పోలీసులకు లభించిన డబ్బుకు ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి సిద్దిపేట ఎన్నికల అధికారి కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలక్షన్ ప్రత్యేక విజిలెన్స్ అధికారి తిరుపతిరావు ఉన్నారు.

గ్రామాల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం



కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో బీజేపీ నాయకుల ప్రచారం



చేగుంట(తూప్రాన్): రుక్మాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లి, రుక్మాపూర్, అనంతసాగర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా రఘునందన్‌రావు పోటీలో ఉన్నందున ప్రజలగురించి ఆలోచించే ఆయన్ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మండలాధ్యక్షుడు భూపాల్, కోకన్వీనర్ గోవింద్, నాయకులు సత్యనారాయణ, సంతోష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మాజీసర్పంచ్ నాగభూషణం, మ్యాకల రమేశ్, స్వామి, సోషల్‌మీడియా అంజనేయులు, మ్యాకల రాంచంద్రం నాయకులు పాల్గొన్నారు.

నార్సింగి మండల కేంద్రంలో..

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న స్థలంలో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నార్సింగి బీజేపీ మండలాధ్యక్షుడు బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగిలో ఉపాధి హామీ కూలీలకు వారి పని స్థలంలో కలిసి మాట్లాడారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు చంద్రశేఖర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు నరేష్, గురుపాదం, లక్ష్మణ్, నర్సింలు, బూత్ అధ్యక్షుడు నరేష్, సాయి, శేఖర్ రెడ్డి, సాయి చరణ్, గంగాధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేటలో..

కౌల్దారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు గిరి, పోచేందర్, రంగరాజు, కార్యకర్తలు సాయి, దుర్గేష్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీ.పాటిల్ అన్నారు. సోమవారం ఎటలోని బీజేపీ కార్యాలయంలో చీలాపల్లికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీ దామోదర్‌తో పాటు శివాయిపల్లి, బూర్గుపల్లి తదితర గ్రామాల యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విఠల్, నాయకులు తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీజేపీని ఓడించాలి

వెల్దుర్తి(తూప్రాన్): రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీని ఓడించాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం వెల్దుర్తిలో ఆయన మాట్లాడారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, యూత్ అధ్యక్షుడు నరేష్, మండలాధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

పెద్దశంకరంపేట(మెదక్): కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపేట, రామోజీపల్లి, ఉత్తులూర్, శివాయపల్లి, మాడ్పెట్‌పల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్ తరుపున గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ లక్ష్మీరమేశ్, మాజీ ఎంపీటీసీ మానిక్‌రెడ్డి, శంకర్‌గౌడ్, ఉప్పరి సాయిలు తదితరులు ఉన్నారు.

◆ చికిత్స పొందుతూ గృహిణి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గృహిణి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దొంతి చిన్న పోచమ్మ(34) ఈ నెల 27న కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా ఆదివారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు. మృతురాలి తమ్ముడు రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి

టేక్మాల్(మెదక్): జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం మండల బోడగట్టు గ్రామ ఎంపీటీసీ పరిధిలోని ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సోమవారం ఈ కార్యక్రమానికి క్రాంతి కిరణ్, సీనియర్ నాయకులు జైపాల్ రెడ్డి హాజరై బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వీరప్ప, జనరల్ సెక్రెటరీ అవినాష్, మండల నాయకులు రవి, సొసైటీ వైస్ చైర్మన్ మల్లయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ వెంకట్ గౌడ్, గ్రామ అధ్యక్షుడు శశిరెడ్డి, ఎంపీటీసీ నారాయణ రెడ్డి, నారాయణ, చంద్రయ్య, విఠల్, మాన్య నాయక్, మండల నాయకులు పాల్గొన్నారు

◆ బైబిల్ క్లాసులు ప్రారంభం

నర్సాపూర్: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో సోమవారం వెకేషన్ బైబిల్ క్లాసులు డైరెక్టర్ రెవరెండ్ బాలసుందర్ ప్రారంభించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ సందీప్‌కుమార్, సండే స్కూల్ సెక్రటరీ ప్రేంకుమార్, చర్చి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్‌ను గెలిపించండి

నిజాంపేట(మెదక్): బీఆర్ఎస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలల్లో మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించుకోవాలని సూచించారు. మండల నాయకులు ఉన్నారు.

◆ రోడ్డు ప్రమాదాలపై అవగాహన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని కుకునూర్ గ్రామంలో సోమవారం రాత్రి మెదక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూఢ నమ్మకాలు, రోడ్డు ప్రమాదల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణ, షీ టీమ్స్ విధులు, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాజాత బృందం టీం ఇన్‌చార్జి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కౌల్దారం(నర్సాపూర్): ప్రతీ ఒక్కరు మే 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు కోరారు. సోమవారం మండలంలోని రంగంపేటలో ఓటర్ స్లిప్పుల పంపిణీని ప్రారంభించారు. ఓటు హక్కు కలిగిన ప్రతీ ఒక్కరికీ బీఎల్ఓలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామన్నారు. ఓటు వేసే ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోనుకావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, బీఎల్ఓలు శ్రీలక్ష్మి, విజయలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.